క్లుప్తంగా

రేపు మాంసం విక్రయాలు నిషేధం

వినుకొండ: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2వ తేదీన పట్టణంలో మాంసం విక్రయాలను నిషేధించడమైందని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని మాంసం వ్యాపారస్తులు, చికెన్ స్టాల్స్, చేపల వ్యాపారస్తులు తమ అంగళ్లు మూసివేయాలని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్స్‌లో మాంసాహార విక్రయాలు నిలిపివేయాలని తెలిపారు. అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మహిళా సంఘాలకు రుణాల మంజూరుకు కృషి

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభ్యున్నతికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ బ్యాంకు నరసరావుపేట రీజనల్ మేనేజరు పి.రవికుమార్ అన్నారు. మంగళవారం శావల్యాపురం బ్రాంచ్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 41 బ్యాంకు శాఖలు ఉండగా 10 వేల మహిళా గ్రూపులు ఉన్నాయని, మొదట విడతలో భాగంగా అర్హత కల్గిన 20 వేల మంది మహిళలకు యూనిట్ ఆధారంగా రూ. 2లక్షల నుంచి రూ. 10లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పించనున్నామన్నారు. ఇందులో భాగంగా రూ. 400 కోట్ల నిధులు కేటాయించామని ఈనెల 31లోగా అర్హులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తామన్నారు. శావల్యాపురం బ్రాంచి మేనేజరు వలేటి ప్రసాదు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఈసీలో ఆయుధ పూజ



నరసరావుపేట రూరల్: దుర్గాష్టమిని పురస్కరించుకుని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఈసీ) ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ వినియోగించే రైఫిల్స్, డ్రమ్స్, ఇతర శిక్షణా పరికరాలకు పూజలు నిర్వహించారు. చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆయుధపూజ సాంప్రదాయంలో ఉన్న గొప్ప ఆచారం అని తెలిపారు. డీన్ డాక్టర్ హరిప్రసాద్, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ పరిధిలో యూరియా నిల్వలు 39.6 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు రైతులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రతి యొక్క రైతుకు యూరియా, డీఏపీ ఎరువులు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. డీటీ బి.సుబ్బారావు, వీఆర్వో రమాదేవి, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు, రైతులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



శావల్యాపురం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.సుగుణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ఇంటింటి సర్వేల పేరుతో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. సంబంధం లేని పనులు చేయిస్తూ సచివాలయ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం సమంజసం కాదన్నారు. సచివాలయ ఉద్యోగులచే పింఛనుదారుల ఇంటికి వెళ్లి పింఛను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయటం తగదన్నారు. ప్రత్యేక అవసరాల కల్గియున్న వారి ఇళ్లకే వెళ్ళి పింఛన్లు ఇస్తామని మిగిలివారందరు సచివాలయానికి వచ్చి తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి నూతన కమిటీ



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని శాఖా గ్రంథాలయాలకు అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేస్తూ పౌర గ్రంథాలయ శాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్టు శాఖా గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ మంగళవారం తెలిపారు. నరసరావుపేట శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా స్వర్ణ చినరామిరెడ్డి, కార్యదర్శిగా పిన్నెంటి వీరబ్రహ్మం ఉపాధ్యక్షుడిగా రత్నాకరం రాము, సంయుక్త కార్యదర్శిగా అమ్మా జిలానీ, సభ్యులుగా ఈదర గోపీచంద్, మామిళ్ల కృష్ణయ్య, పీవీఎస్ఆర్ ప్రసాదరావు, బత్తుల మురళి, పి.వి.హనుమంతరావు, షేక్ బాజీమస్తాన్ నియమితులయ్యారు. కమిటీ కోశాధికారి, కన్వీనర్‌గా గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ వ్యవహరిస్తారు. కమిటీ రెండు సంవత్సరాల పాటు పని చేసి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుందని తెలిపారు.



నరసరావుపేటలో దుర్గాదేవి అలంకరణలో..



దుర్గాదేవి అలంకరణలో శారదాంబ



దుర్గాదేవి అలంకరణలో పాతూరు పార్వతీ అమ్మవారు



శావల్యాపురంలో దుర్గాదేవి అలంకరణ



నాదెండ్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

మహాదుర్గ నమోస్తుతే..!

దసరా పర్వదినం సందర్భంగా నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజైన మంగళవారం పలు దేవాయాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవి, శ్రీమహాకాళీ దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

– నరసరావుపేట ఈస్ట్/ శావల్యాపురం/ నాదెండ్ల /యడ్లపాడు /రొంపిచర్ల చిలకలూరిపేట/ వినుకొండ



వినుకొండ బోసుబొమ్మ సెంటర్ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



రేమిడిచర్ల శ్రీ గంగా గౌరీ పార్వతి దేవాలయంలో..



దుర్గాదేవిగా సొలస గ్రామంలోని అమ్మవారు



శ్రీ దుర్గా దేవి అలంకరణలో రెడ్డినగర్ బతుకమ్మ



సాతులూరు శివాలయంలో..



చిలకలూరిపేటలో దుర్గాదేవి అలంకరణలో..

తవ్వారు.. పూడ్చడం మరిచారు!

- జేజేఎం పథకం పైపులైన్ల ఏర్పాటుకు యథేచ్ఛగా రోడ్ల తవ్వకం
- ఆనక పూడ్చడం మరిచిన అధికారులు
- రోడ్లపై నిలిచిన మురుగు.. పారుదల కాని కాల్వలు
- బొల్లాపల్లి మండలం ఆయ్యన్నపాలెంలో దుస్థితి



ఆయ్యన్నపాలెం గ్రామంలో రోడ్డు తవ్వేసి వదిలేయడంతో చేరిన మురుగు

బొల్లాపల్లి: అయ్యన్నపాలెం గ్రామ పంచాయతీ కేంద్రంలో అంతర్గత రహదారులు ధ్వంసమై.. మురుగు కాలువల్లో పూడిక చేరి పారుదల లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామానికి రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా గ్రామంలో బోరు, మోటారు తోపాటు ఇంటింటికి కుళాయి కనెక్షన్‌కు పైపులైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో, ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి గ్రామంలో పైపు లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈక్రమంలో గత 20 రోజుల క్రితం రోడ్లను యథేచ్ఛగా తవ్వడంతో రోడ్ల వ్యర్థాలు సైడ్ కాలువల్లో పడిపోయి, మురుగునీటి పారుదల నిలిచింది. దీంతో వీధులన్నీ మురుగు నీటి కుంటలుగా మారాయి. తిరిగి సైడు కాలువలు పనులు చేపట్టకపోవడటంతో, మురుగు వీధుల్లో చేరి బురదకయ్యలుగా మారాయి. వీధుల్లో తిరగాలంటే ఇబ్బందికరంగా ఉందని, దుర్గంధాన్ని వెదజల్లుతూ, దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటివరకు పంచాయతీ పాలన యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు అంటున్నారు. మురుగునీటితో చిత్తడిగా ఉన్న అంతర్గత రహదారులను బాగు చేయాలని, ఇప్పటికైనా పంచాయతీ పాలన యంత్రాంగం గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారుల తవ్వకంతో ఇబ్బందులు



గ్రామానికి జేజేఎం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పైపులైను ఏర్పాటు చేసేందుకు తవ్వడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి తిరిగి బాగు చేయలేదు. గ్రామం మొత్తానికి పైపులైను పూర్తిగా ఏర్పాటు కాలేదు.

– పి.సాయిబాబు, సర్పంచ్, అయ్యన్నపాలెం

క్రైస్తవుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



తహసీల్దార్ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘం నేతలు

నరసరావుపేట: చర్చిలు, పాస్టర్లు, క్రైస్తవుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రముఖ సామాజికవేత్త, ఆలిండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గొల్లమూడి రాజసుందర్‌బాబు కోరారు. మంగళవారం పట్టణంలోని వెస్ట్ పారిస్ లూథరన్ చర్చి నుంచి కలెక్టరేట్ వరకు క్రైస్తవ సంఘాలైన యూపీఎఫ్ఎస్, రొంపిచర్ల మండల పాస్టర్ల ఫెలోషిప్, లూథరన్ చర్చి, ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. తొలుత వెస్ట్ ప్యారిస్ చర్చి కమ్యూనిటీ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సభకు పాస్టర్ రెవరెండ్ పి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ గొల్లమూడి మాట్లాడుతూ క్రీస్తు ప్రేమ, శాంతిని సమాధానాన్ని సమాజంలో అందిస్తున్న క్రైస్తవ పాస్టర్లు, చర్చిలు, సంస్థలపై దాడి చేసి హింసించడం భావ్యం, సమంజసం కాదన్నారు. భారత రాజ్యాంగం మత స్వేచ్ఛను కల్పిస్తే కొన్ని మతాలలోని ఉన్న అసమానతలు కారణంగా చాలామంది క్రైస్తవ మతం పట్ల మొగ్గు చూపుతున్న తరుణంలో, మతమార్పిడి వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి పాస్టర్లను జైలుపాలు చేసి కనీసం బెయిల్ కూడా లేకుండా ఇబ్బంది పెడుతున్న విధానం మత స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. షాలోమ్ చర్చి వ్యవస్థాపకులు రెవరెండ్ సుధీర్‌కుమార్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు అర్చిరావు మాట్లాడుతూ, దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను బట్టి ప్రధానంగా మన రాష్ట్రంలో చర్చిలు, పాస్టర్లు, క్రైస్తవుల పరిరక్షణ కోసం ఒక క్రైస్తవ అత్యాచార చట్టాన్ని రూపొందించడం సమంజసమని పేర్కొన్నారు. పాస్టర్లు రత్నకుమార్, తిమోతి, జీవరత్నం, ఏసుపాదం, వీరారెడ్డి, డేవిడ్ రాజు పాల్గొని ప్రసంగించారు. ర్యాలీ అనంతరం క్రైస్తవులు, పాస్టర్లు నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ వేణుగోపాలరావుకు 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.

సూపర్ జీఎస్‌టీతో ధరలు తగ్గుదల



నరసరావుపేట: సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ సోమవారం నరసరావుపేటలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణంలోని కాసు సెంట్రల్ మాల్‌లోని పలు షోరూంలను ఆయన సందర్శించి ధరలు తగ్గించి అమ్ముతున్నారో లేదో తెలుసుకున్నారు. అలాగే కొనుగోలుదారులతో మాట్లాడి ప్రభుత్వం తగ్గించిన వస్తువుల రేట్ల పట్ల వారి స్పందనను తెలుసుకున్నారు. తరువాత స్వాతిమాల్ షోరూంని సందర్శించి ధరలపై ఆరా తీశారు. అక్కడ కూడా కొనుగోలుదారులతో మాట్లాడారు. అనంతరం నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై సూపర్ జీఎస్‌టీ వేడుకలు విజయవంతంగా నిర్వహించడానికి వారి సహకారాన్ని కోరారు. తర్వాత స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సూపర్ జీఎస్‌టీ వేడుకల గురించి చర్చించారు. 11వ వార్డులో పర్యటించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సన్మానం



నరసరావుపేట రూరల్: పోలీసు శాఖలో సుదీర్ఘంగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, అదనపు ఎస్పీ(ఏఆర్) వి.సత్తిరాజులు పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ ఎస్‌కేపీ మస్తాన్‌వలి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కే మౌలాలిలను పూలమాలలు, శాలువాలతో అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న సిబ్బంది సేవల వెనుక కుటుంబ సభ్యుల త్యాగం, సహకారం ఎంతో ఉంటుందని తెలిపారు. డీఎస్పీ(ఏఆర్) మహాత్మాగాంధీ రెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్, ఎంటీఆర్ఐ ఎ.కృష్ణ, ఏఎస్ఎస్ ఆర్ఐ యువరాజ్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం

నరసరావుపేట: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రెండో తేదీ గురువారం గుంటూరురోడ్డులోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పటల్‌లో ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన హాస్పిటల్‌లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు చేస్తామని, ప్రతి డిజిటల్ ప్రోగ్రామబుల్ చెవిటి మిషన్‌పై 30శాతం రాయితీ, వర్టిగో (తల తిరుగుడు) పరీక్షపై 20శాతం రాయితీ ఇవ్వబడుతుందన్నారు. లాటరీ పద్ధతి ద్వారా 10 మందిని ఎంపిక చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని, మందులు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేధింపులను డిజిటల్ బుక్‌లో నమోదు చేద్దాం

చిలకలూరిపేట: కార్యకర్తలపై వేధింపులకు పాల్పడే వారిని డిజిటల్ బుక్‌లో నమోదు చేద్దామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజని నివాసంలో వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ యాప్‌ను మంగళవారం పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, వేధింపులు, కక్ష సాధింపు చర్యలు, తప్పుడు కేసులకు సమాధానంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని చెప్పారు. ఈ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలను రికార్డు చేయవచ్చన్నారు. కార్యకర్తలకు భరోసా, ప్రతి అన్యాయానికి సాక్ష్యం, భవిష్యత్తులో న్యాయం చేసేందుకు ఆధారంగా డిజిటల్ బుక్ నిలుస్తుందన్నారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు గోపతోటి జాన్, ప్రధాన కార్యదర్శి బండారు జయకుమార్, కౌన్సిలర్లు షేక్ యాసుఫ్ఆలి, వడితే కోట్యానాయక్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, పార్టీ ఇంటిలెక్చువల్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి, నాయకులు కొచ్చెర్ల కిషోర్, కొప్పురావూరి పటేల్, తియ్యగూర అంజిరెడ్డి, పఠాన్ తలహాఖాన్, డీలర్ సుభాని, సీతమ్మ, దాసరి అంజలి తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

డిజిటల్ బుక్‌తో కొండంత అండ

యడ్లపాడు: కార్యకర్తలకు మనోధైర్యాన్ని, భరోసాను అందించే లక్ష్యంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన డిజిటల్ బుక్ ఒక ఆశాకిరణం లాంటిదని వైఎస్సార్ సీపీ యడ్లపాడు మండల అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు చెప్పారు. సోమవారం రాత్రి మండల కేంద్రంమైన యడ్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కనబెట్టి, ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. అయితే ఈ బెదిరింపులకు తమ పార్టీ శ్రేణులు భయపడరని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎక్కడ, ఎటువంటి అన్యాయం జరిగిన వెంటనే డిజిటల్ బుక్ లో లాగిన్ అయ్యి వివరాలను నమోదు చేసుకోవాలని నరసింహారావు పిలుపునిచ్చారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రాచమంటి చింతారావు, పార్టీ జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి పందుల బుల్లెబ్బాయి, నాయకులు కురంగి నాగమల్లేశ్వరరావు, గౌరు రాజేష్, షేక్ రసూల్, కర్నాట సుబ్బారావు, బండ్ల పున్నారావు, కారుచోల సునీల్, మామిడి మోహన్‌రావు, కట్టా నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

- పేకాట స్థావరంపై దాడి

నాదెండ్ల: పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు కావూరు వెళ్లే అండర్ పాస్ సమీపంలో పేకాటాడుతున్న సమాచారంతో దాడి చేశామన్నారు. ఏడుగురు పేకాటాడుతుండగా, వారిలో నలుగురిని పట్టుకోగా, ముగ్గురు పరారయ్యారు. జూదరుల నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.